సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం । 15 । మార్చి । 2025



లక్ష్యాన్ని ఛేదించారు..
ఉమ్మడి జిల్లాలోని పలువురు యువత తమ లక్ష్యాన్ని ఛేదించారు. గ్రూప్–3 ఫలితాల్లో పలువురు ఉత్తమ ర్యాంకులు సాధించి తమ కలను సాకారం చేసుకున్నారు. - 8లో▸



భూపాలపల్లిలో మరో పులి ?
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమలాపూర్, రాంపూర్ గ్రామాల మధ్య పులి పాదముద్రలను ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. - 8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 39°/22°

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో వేడితోపాటు ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం సమయంలో వాతావరణం ఆహ్లాదంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

18, 19 తేదీల్లో జాతీయ సదస్సు
కేయూ క్యాంపస్: '75 ఇయర్స్ ఆఫ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్–మైల్ స్టోన్స్ ఇష్యూస్ అండ్ చాలెంజెస్' అంశంపై ఈనెల 18, 19 తేదీల్లో కేయూలో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ టి.రాజమణి ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు పూర్వపు జడ్జి, ప్రస్తుత మహాదాయి వాటర్ ట్రిబ్యూనల్ జడ్జి పీఎస్ నారాయణ, తెలంగాణ హ్యూమన్ రైట్స్ పూర్వపు చైర్మన్ జస్టిస్ చంద్రయ్య, కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం హాజరవుతారని పేర్కొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు
విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ అన్ని పాఠశాలల్లోనూ ఈనెల 15వ తేదీ నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులకు తప్పనిసరిగా తరగతులు అయిపోయాక మధ్యాహ్న భోజనం పెట్టాల్సి ఉంటుంది. ఈనెల 21 నుంచి టెన్త్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఉన్నందున.. పరీక్ష కేంద్రాలుగా ఉన్న హైస్కూళ్లను మధ్యాహ్నం ఒంటి గంటనుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలి. విద్యార్థులకు ముందే మధ్యాహ్న భోజనం అందించి తరువాత క్లాసులు నిర్వహించాల్సి ఉంటుంది.

నేడు టెన్నికాయిట్ పోటీలు
వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర 10వ టెన్నికాయిట్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు టెన్నికాయిట్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు అలువాల రాజ్‌కుమార్, గోకారపు శ్యాంకుమార్ తెలిపారు. హనుమకొండ జేఎన్ స్టేడియంలో నిర్వహించే ఈ పోటీలకు 300 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. గెలుపొందిన జట్లు ఈనెల 25 నుంచి ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

'మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ సరికాదు'
కాజీపేట: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ సరికాదని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. ఈమేరకు కాజీపేట చౌరస్తాలో వారు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని నిరసిస్తూ కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. స్థానిక సీఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యాన పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి సీఎం దిష్టిబొమ్మను లాక్కోవడంతో బీఆర్‌ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో నార్లగిరి రమేశ్, పి.శివకుమార్, కాటపురం రాజు, సుంచు రఘురాం, తేలు సారంగపాణి, మర్యాల కృష్ణ, తండమల్ల వేణు, సోని, మహమూద్, పాము రాజేశ్, వినయ్ పాల్గొన్నారు.

హోలీ వేడుకల్లో వరంగల్ కలెక్టర్ సత్యశారద కుటుంబ సభ్యులు, అధికారులు



హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవోస్ నాయకులు, బాలసముద్రంలో వింగ్ అధికారులతో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కుటుంబం







రంగు పడింది
● అంబరాన్నంటిన హోలీ సంబురం

జిల్లాలో శుక్రవారం హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. ప్రజలు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు చిన్నా పెద్దా తేడా లేకుండా రంగుల్లో మునిగితేలారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సీపీ, పోలీస్ అధికారులు, సిబ్బంది తీన్మార్ స్టెప్పులతో సందడి చేశారు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.


- సాక్షి నెట్‌వర్క్



కమిషనరేట్‌లో పోలీసు అధికారులతో కలిసి నృత్యం చేస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

మరిన్ని చిత్రాలు 9లో▸

మార్కెట్లో మాయ!
కొలతలు, తూకాల్లో మోసం



- సంబంధిత అధికారుల్లో నిర్లిప్తత
- నష్టపోతున్న వినియోగదారులు
- ప్రశ్నించి పోరాడితేనే దగాకు చెక్

నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

సాక్షి, వరంగల్:

మార్కెట్లో కొందరు వ్యాపారులు తూకాలు, కొలతల్లో వినియోగదారులను మోసం చేస్తున్నారు. కూరగాయలు, నిత్యావసరాలతోపాటు అన్నింటిలోనూ చేతివాటం ప్రదర్శిస్తూనే ఉన్నారు. అక్రమాలను అరికట్టాల్సిన తూనికలు, కొలతలు, ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడం.. వినియోగదారుల హక్కులపై ప్రచారం చేయడంలోనూ విఫలమవడం ఇందుకు కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కమిషన్‌ను ఎప్పుడు ఆశ్రయించాలంటే..

ఆన్‌లైన్ సేవలు విస్తృతం కావడంతో ఇంటి నుంచి వివిధ వస్తువుల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఈనేపథ్యంలో ఆన్‌లైన్ వ్యాపార లావాదేవీలను కూడా వినియోగదారుల రక్షణ చట్టం –2019 పరిధిలోకి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. కొనుగోలు చేసిన వస్తువుల్లో నాణ్యత లోపించినా.. వాటి వల్ల నష్టం జరిగినా.. తూకాల్లో మోసాలకు పాల్పడినా పరిహారం కోరే హక్కు వినియోగదారుడికి ఉంటుంది. నాణ్యతలేని, కల్తీ సరుకులు విక్రయించినప్పుడు.. కాలం చెల్లిన ఔషధాలు అమ్మినా.. గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువకు విక్రయించినా.. ప్రైవేట్ వైద్యుల నిర్లక్ష్యం, సేవల్లో లోపం కారణంగా నష్టం వాటిల్లినా.. ఎలక్ట్రానిక్ పరికరాలు సక్రమంగా పని చేయకపోయినా.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కల్తీ జరిగినా.. బ్యాంకులు, విద్యుత్ సంస్థలు, విమానయాన సంస్థలు, బీమా సంస్థలు అందించే సేవల్లో లోపాలు ఉంటే వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చు.

> వరంగల్‌కు చెందిన భద్రయ్య అనే వ్యక్తి ఓ హోల్‌సేల్ షాపులో కారం ప్యాకెట్ కొన్నాడు. ఇంటికి వెళ్లి తెరచి చూశాడు. అది కల్తీ కారం అని గుర్తించి షాపు యాజమాని వద్దకు వెళ్లి అడిగితే అతను గొడవకు దిగాడు.

> శివనగర్‌కు చెందిన శ్రీను ఆన్‌లైన్‌లో ఓ ప్రముఖ కంపెనీకి చెందిన సెల్‌ఫోన్ ఆర్డర్ చేశాడు. కొరియర్‌లో ఇంటికి వచ్చిన బాక్స్ తెరచి చూశాడు. అందులో పనిచేయని మొబైల్ ఫోన్ ఉండడంతో బిత్తరపోయాడు.



ఏ ఫిర్యాదు ఎక్కడ.. ఎంత నగదు?

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కన్జూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్ (వినియోగదారుల కమిషన్) పని చేస్తుంది. జిల్లా స్థాయి ఫోరం వస్తువులు/సేవల విలువ రూ.50 లక్షల్లోపు ఫిర్యాదులు పరిష్కరిస్తుంది. రూ.కోటి నుంచి రూ.2 కోట్ల మధ్య రాష్ట్ర స్థాయి, రూ.2 కోట్లకు మించిన విలువైన ఫిర్యాదులను జాతీయ స్థాయి ఫోరం పరిష్కరిస్తుంది. వస్తు సేవల్లో నష్టపోయి పరిహారం కోరాలనుకుంటే.. వివరాలను నాలుగు ప్రతులతో దరఖాస్తు చేయాలి. వస్తువుసేవల కొనుగోలు రుజువులు జతపర్చాలి. ఫోరం ఫీజు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రూ.200, రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రూ.400, రూ.10 లక్షలు ఆపైన పరిహారం కోసం రూ.500 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఫిర్యాదును పరిశీలించిన తర్వాత ఫోరం స్వీకరించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. వివిధ కారణాలతో తిరస్కరిస్తే ఫిర్యాదుదారుడు తనవాదన వినిపించవచ్చు. ఫోరంలో వినియోగదారుడే తన కేసును వాదించుకోవచ్చు. లేదా న్యాయవాదిని నియమించుకోవచ్చు.

మోసం.. కల్తీ ఇలా..
- నిత్యావసరాలు, ఇతర ఆహార పదార్థాలు, పండ్ల తూకాల్లో మోసాల సంగతి చెప్పనక్కర్లేదు. కిలోకు 200 గ్రాముల వరకూ కోతపెట్టి అమ్ముతున్నారు. కొన్ని వస్తువులను ప్రామాణిక ముద్రతో విక్రయించాల్సి ఉన్నా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వార సంతలు, మార్కెట్లు, రైతు బజార్లలో సైతం రాళ్లనే తూనికలకు వినియోగిస్తున్నారు. పాలు, వంట నూనెలు, ఉప్పు, మిరప పొడి, ఐస్ క్రీం, బేకరీ ఫుడ్స్, ఫ్రైడ్ చికెన్, మసాలా దినుసులు, అన్ని రకాల స్వీట్లలో కల్తీ జరుగుతోంది.
- జనరిక్ మందుల పేరిట అధిక ధరలకు అమ్ముతున్నారు. డాక్టర్ అటాచ్డ్ కౌంటర్లలో చెప్పనక్కరలేదు. ప్లాస్టిక్ బాటిళ్లలో దగ్గు మందులు విక్రయించొద్దు. కాలపరిమితి ముగిసిన మందులు సైతం విక్రయిస్తున్న మెడికల్ దుకాణాలు ఉండడం గమనార్హం.
- కొన్ని పెట్రోల్ బంకుల్లో ఎలక్ట్రికల్ రీడింగ్ మిషన్లను ట్యాంపరింగ్ చేస్తున్నారు. లీటరు పెట్రోల్‌కు 100 నుంచి 200 మిల్లీలీటర్ల వరకూ తక్కువగా వస్తోంది. ఏరోజుకారోజు పెట్రోల్, డీజిల్ ధరలను ప్రదర్శించాల్సి ఉన్నా.. ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు.
- గృహ నిర్మాణ సామగ్రి అమ్మకాల్లోనూ మోసాలు జరుగుతున్నాయి. 25 కేజీల సిమెంట్ బస్తాకు కేజీ, కేజీన్నర తరుగు వస్తోంది. కొంతమంది దళారులు బస్తాల్లోని సిమెంట్ తీసి రీ ప్యాక్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇనుము కేజీల లెక్కన విక్రయించాల్సి ఉన్నా.. చాలామంది విడి పరికరాల కింద అమ్ముతూ తూనికలు, కొలతల్లో మోసం చేస్తున్నారు.
- బంగారు ఆభరణాలు విక్రయించే కొన్ని షాపుల్లో తూకాల్లో తేడా ఉంటోంది. పండుగల రాయితీలు.. గ్రాము రూ.200 తక్కువ అంటూ ప్రకటనలతో ఆకర్షిస్తూ మోసం చేస్తున్నారు. ఈవిషయమై తూనికలు.. కొలతల శాఖ అధికారులకు ఫిర్యాదులు అందడంతో డిజిటల్ త్రాసుల్లో లోపాలను గుర్తించి జరిమానాలు విధిస్తున్నారు. బంగారం, వెండి అమ్మకాల్లో రశీదుపై నాణ్యతా ప్రమాణాలు, హెచ్‌యూఐడీ నంబర్ తప్పనిసరిగా రాయాలి. చాలా వరకు ఇవి పాటించడం లేదనే ఫిర్యాదులున్నాయి.

వాట్సాప్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు..
జిల్లా వినియోగదారుల ఫోరంలో చేసే ఫిర్యాదులను 90 రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తాం. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించి సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా స్వీకరించి ప్రతివాదులకు నోటీసులు పంపించి.. వినియోగదారులకు అండగా నిలుస్తాం. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయించినా, నాసిరకం ఉత్పత్తులు అంటగట్టినా ఇంటి నుంచి వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకు కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ 'వాట్సాప్ చాట్‌బాట్' సేవలను అందుబాటులోకి తెచ్చింది. వాట్సాప్ నంబరు 88000 01915కు ముందుగా హాయ్ అని టైప్ చేయాలి. అక్కడి నుంచి వచ్చే సూచనలతో వివరాలు నమోదు చేస్తే జాతీయ వినియోగదారుల కమిషన్ హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు నమోదవుతుంది. ఆ తర్వాత ఆ ఫిర్యాదు పరిష్కారం కోసం సంబంధిత జిల్లా వినియోగదారుల కమిషన్‌కు పంపుతారు. అలాగే.. 18001 14000 లేదా 1915 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. నంబర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

- నాగరాజు, అధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల కమిషన్, వరంగల్

వినియోగదారులకు అండగా..


వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ తెలంగాణ రాష్ట్రంలో 'ఈట్ రైట్ ఫుడ్' అనే అంశంపై వినియోగదారుల్లో చైతన్యం కల్పిస్తూ అండగా నిలుస్తున్నాం. కల్తీ పాల అమ్మకందారులపై నాలుగు ప్రైవేట్ డెయిరీలపై ఫిర్యాదు చేశాం. దగ్గు మందుల్లో హానికారకాలు, బాటిళ్లపై సమాచారం లేకపోవడం, ప్లాస్టిక్ బాటిళ్లలో విక్రయంపై జాతీయ వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశాం. అమ్మాయిలను ఆకర్షించి మోసగిస్తున్న స్లిమ్మింగ్ సెంటర్లపై కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ అథారిటీలో ఫిర్యాదు చేశాం.

- సాంబరాజు చక్రపాణి, వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి

ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి..
● సీసీఐ సీనియర్ సెక్రటరీ దామోదర్




మాట్లాడుతున్న దామోదర్

హన్మకొండ: వినియోగదారులు ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు, సీసీఐ సీనియర్ సెక్రటరీ డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలో జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఏ వస్తువు కొన్నా.. ఒరిజినల్ బిల్లులు తీసుకోవాలన్నారు. ఉత్పత్తిదారుడు ఇచ్చే గ్యారంటీ, వారంటీ కార్డులను జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని సూచించారు. వస్తువుల్లో నాణ్యతా లోపం ఉన్నప్పుడు వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం పొందాలన్నారు.

నవోదయలో హోలీ వేడుకలు!
మామునూరు: మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం ఉదయం హోలీ వేడుకలు జరుపుకున్నట్లు తెలిసింది. విద్యార్థులు గేటు బయటకు వెళ్లి కోడిగుడ్లు తెచ్చి హోలీ సంబురాల్లో మునిగిపోయారు. గేటు బయటకు ఎలా వెళ్లారనే దానిపై ప్రిన్సిపాల్ విద్యార్థులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజంతా చదువుకుని పరీక్ష రాయాల్సిన సమయంలో.. వేడుకలకు ఎలా అనుమతిచ్చారనే దానిపై ఉన్నతాధికారులు ప్రిన్సిపాల్‌ను వివరణ కోరినట్లు విశ్వసనీయ సమాచారం.

ఇరువర్గాల దాడులు
వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణంలో శుక్రవారం ఇరువర్గాల యువకులు పరస్పర దాడులు చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. డీసీ తండా పరిధిలోని బావనికుంట తండాకు చెందిన యువకులు పట్టణంలోని మద్యం షాపులో మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలో యువకుల మధ్య మాటామాట పెరగడంతో ఇరువర్గాలుగా విడిపోయి దాడులకు దిగారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాల వారు ఆస్పత్రి వద్దకు చేరుకుని మళ్లీ ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. వెంటనే ఎస్సై చందర్ వారిని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. దాడుల్లో గాయపడిన బాబులాల్, వాంకుడోతు హుస్సేన్ తదితరులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో కొమ్మాల జాతర ప్రాంగణం (ఇన్‌సెట్‌లో) నర్సింహస్వామి వారు - వివరాలు 8లో▸

కొమ్మాల జాతర షురూ..
గీసుకొండ: బండ్లు తిరిగే కార్యక్రమంతో శుక్రవారం మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. రాజకీయ ప్రభబండ్ల రావడంతో ట్రాఫిక్ జాం ఏర్పడి భక్తులు, అంబులెన్స్‌లలోని రోగులకు ఇక్కట్లు తప్పలేదు. కాంగ్రెస్ ప్రభను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, బీఆర్‌ఎస్ ప్రభను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, బీజేపీ ప్రభను డాక్టర్ కాళీప్రసాదరావు ప్రారంభించారు.



దేవన్నపేటలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న హరీశ్‌రావు, ఎర్రబెల్లి తదితరులు

సభా వేదిక దేవన్నపేట!
- బీఆర్‌ఎస్ రజతోత్సవ సభా స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు
- విజయవంతానికి త్వరలో కమిటీలు.. ఉమ్మడి జిల్లా నేతలతో కేసీఆర్ భేటీ?

సాక్షిప్రతినిధి, వరంగల్ : బీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న రజతోత్సవ సభకు గ్రేటర్ వరంగల్ పరిధి దేవన్నపేట శివారును నాయకులు ఎంపిక చేశారు. 14 ఏళ్ల అవిశ్రాంత పోరాటాన్ని, పదేళ్ల పరిపాలనపై ఏడాది పాటు వేడుకలు నిర్వహించాలని భావించిన బీఆర్‌ఎస్.. వరంగల్ సభ ద్వారా ప్రారంభించాలని తలపెట్టింది. ఈనేపథ్యంలో గ్రేటర్ వరంగల్ పరిధి ఉనికిచర్ల, భట్టుపల్లి, దేవన్నపేట ప్రాంతాల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో ముఖ్యనేతలు ఈనెల 10న స్థలాన్ని పరిశీలించారు. అయితే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా.. సభకు హాజరయ్యే జనం ఈజీగా వచ్చిపోయేలా ఉండాలని భావించి శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయభాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితరులతో కలిసి హరీశ్‌రావు స్థల పరిశీలన చేశారు. జాతీయ రహదారి పక్కన ఉండడంతో పాటు నలుమూలల నుంచి వాహనాల ద్వారా వచ్చిపోయేందుకు దేవన్నపేట అనువుగా ఉంటుందని భావించి అధినేత కేసీఆర్ సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. చివరికి దేవన్నపేటను ఫైనల్ చేసినట్లుగా చెప్పారు. స్థలపరిశీలన అనంతరం హరీశ్‌రావు సుమారు గంటపాటు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో మాట్లాడారు. సుమారు 15 లక్షల మందితో భారీ సభ నిర్వహించడానికి నాయకత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఇదే సమయంలో సభ సక్సెస్ కోసం ఉమ్మడి వరంగల్‌కు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ కానున్నారని సమాచారం.

క్లుప్తంగా

18, 19 తేదీల్లో ఎంబీఏ అడ్మిషన్ల కౌన్సెలింగ్

విద్యారణ్యపురి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎంబీఏ హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్(హెచ్‌హెచ్‌సీఎం) అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ వర్సిటీ అభ్యాసక సహాయ సేవా విభాగం(ఎల్ఎస్ఎస్‌బీ) డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ ప్రవేశ పరీక్ష, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టీజీఐసెట్‌లో అర్హత సాధించిన వారికి అవకాశం ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు అంబేడ్కర్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో ఆయా తేదీల్లో నిర్వహించే అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు అర్హత పరీక్ష, ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు ఒకసెట్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. అంబేడ్కర్ వర్సిటీ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వలో పడి మహిళ మృతి

పర్వతగిరి: ఎస్సారెస్పీ కాల్వలో కొట్టుకుపోయి మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని హట్యతండా శివారు ఎర్రకుంట తండాలో చోటు చేసుకుంది. ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రకుంటతండాకు చెందిన బాదావత్ నేజి(78) గురువారం ఉదయం దుస్తులు ఉతకడానికి ఎస్సారెస్పీ కాల్వలోకి వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి కొట్టుకుపోయింది. శుక్రవారం ఉదయం నెక్కొండ మండలం బొల్లికొండ తండా వద్ద ఎస్సారెస్పీ కెనాల్‌లో శవమై తేలి కన్పించింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూపాలపల్లి అటవీ గ్రామాల్లో మరో పులి ?



పులి పాదముద్రలు

భూపాలపల్లి రూరల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలంలోని కమలాపూర్, రాంపూర్ గ్రామాల మధ్య ఫారెస్టు అధికారులు శుక్రవారం పులి పాదముద్రలు గుర్తించారు. కాటారం, మండలం జాదారావుపేట గ్రామ పంచాయతీ పరిధిలో రఘుపల్లి అటవీ ప్రాంతంలో చెరువుకట్టపై ఈ నెల 12న ఆవు దూడను చంపి తిన్నట్లు ఆనవాళ్లు లభించాయి.

పాదముద్రలు వేరేనా..?

శుక్రవారం కాటారం మండలం మేడిపలి, కొత్తపల్లి గ్రామాల మీదుగా భూపాలపల్లి మండలంలోని రాంపూర్, కమలాపూర్ అటవీ గ్రామాల మధ్య పులి అడుగుజాడలను ఫారెస్టు అధికారులు గుర్తించారు. కాటారం పులి పాదముద్రలు, ఈ పులి పాదముద్రలు సరిపోకపోవడంతో మరో ఆడ పులిగా అనుమానిస్తున్నారు. కాటారం మండలంలో మగ పులి, భూపాలపల్లి మండలలో ఆడ పులి తిరుగుతున్న నేపథ్యంలో భూపాలపల్లి అటవీ గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. గ్రామస్తులకు పులి కనపడిన, అటవీలో ఉచ్చులు, విద్యుత్ తీగలు అమర్చి పులులకు ప్రమాదాన్ని కలిగించినా.. కఠిన చర్యలు తప్పవని ఫారెస్టు అధికారులు హెచ్చరిస్తున్నారు.

లక్ష్యాన్ని ఛేదించారు..



గ్రూప్స్‌లో మెరిసిన యువత | **రెండుకు మించి ఉద్యోగాలు**

పట్టుదల, ఏకాగ్రతే వారధిగా ఉద్యోగ వేట సాగించిన ఉమ్మడి జిల్లాలోని పలువురు యువత తమ లక్ష్యాన్ని ఛేదించారు. కష్టానికి ప్రతిఫలాన్ని పొంది గెలుపుబావుటా ఎగురవేశారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందులను ఎదిరించి ఉన్నత ఉద్యోగాలను కైవసం చేసుకుని సత్తా చాటారు. గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 ఫలితాల్లో పలువురు ఉత్తమ ర్యాంకులు సాధించి తమ కలను సాకారం చేసుకున్నారు. లక్ష్యాన్ని ఛేదించి ఆదర్శంగా నిలిచిన యువత వివరాలు ఇలా...

చిరు వ్యాపారి బిడ్డకు మూడు ఉద్యోగాలు



దోలి సంధ్య

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని కేసముద్రం రోడ్డులో ఆర్టీసీ బస్టాండ్ వద్ద చిన్న హోటల్ నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్న దోలి వెంకటేశ్వర్లు –పద్మ దంపతులు. వారి కుమార్తె దోలి సంధ్య గ్రూప్–3లో 450 మార్కులకు 269.9 మార్కులతో 1,125 ర్యాంక్ సాధించింది. జోనల్ స్థాయిలో బీసీ(ఏ) మహిళల విభాగంలో 2వ ర్యాంక్ సాధించింది. అయితే ఇప్పటికే గ్రూప్–4లో ఉన్నత ర్యాంకు సాధించిన సంధ్య మానుకోట మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌గా విధుల్లో కొనసాగిస్తోంది. అదే విధంగా ఈ నెల 11న విడుదలైన గ్రూప్–2 ఫలితాల్లో సంధ్య 600 మార్కులకు 382.4 మార్కులతో 205 ర్యాంక్ సాధించింది. రాష్ట్రస్థాయిలో మహిళల విభాగంలో 16 స్థానం, బీసీ(ఏ)లో మహిళా విభాగంలో మొదటి ర్యాంక్ సాధించారు. గ్రూప్–2లో మంచి పోస్ట్ వస్తే ఆ ఉద్యోగంలో చేరుతానని చెబుతున్న సంధ్యను తల్లిదండ్రులు, స్నేహితులు అభినందించారు.

గ్రూప్–3లో సత్తా చాటిన ప్రణీత్



ప్రణీత్

కొడకండ్ల: గ్రూప్–2 ఫలితాల్లో ప్రతిభను చాటుకున్న కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన చెన్న ప్రణీత్ గ్రూప్–3 ఫలితాల్లో 285 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 395 ర్యాంక్‌ను సాధించి సత్తా చాటాడు. 2019లో సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఎస్సీ పూర్తి చేసిన ప్రణీత్ సివిల్స్ సాధించాలనే సంకల్పంతో ఉండగా గ్రూప్స్ నోటిఫికేషన్లు రావడంతో వాటిపై దృష్టి సారించాడు. గ్రూప్–4 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 55వ ర్యాంక్ సాధించి ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రణీత్ గ్రూప్–2 ఫలితాల్లో 388 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 138వ ర్యాంక్ సాధించడమే కాకుండా గ్రూప్–3 ఫలితాల్లోనూ ప్రతిభను చాటుకున్నాడు. నిరుపేద పద్మశాలీ కుటుంబానికి చెందిన ప్రణీత్ ఉత్తమ ర్యాంక్ పొందడంపై తల్లిదండ్రులు చెన్న సోమనారాయణ నాగలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

కోచింగ్ లేకుండానే..



సుంకరి కేదారేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్: జనగామ మండలం సిద్దంకి గ్రామానికి చెందిన సుంకరి కేదారేశ్వర్‌రెడ్డి ఎలాంటి కోచింగ్‌లేకుండానే ఇటీవల విడుదలైన గ్రూప్– 2 ఫలితాల్లో 112వ ర్యాంక్, గ్రూప్–3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంక్ సాధించి సత్తాచాటాడు. సిద్దంకి గ్రామానికి చెందిన సుంకరి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు కేదారేశ్వర్‌రెడ్డి సివిల్ సప్లయిస్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. ఈ సందర్భంగా కేదారేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి కోచింగ్ లేకుండానే గ్రూప్– 2లో ఉత్తమ ర్యాంక్ రావడం సంతోషంగా ఉందన్నారు. కేదారేశ్వర్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలకు ఉత్తమ సేవ అందిస్తా..



అజయ్‌కుమార్

- గ్రూప్–3 26వ ర్యాంకర్ అజయ్‌కుమార్

చిట్యాల: ప్రజలకు ఉత్తమ సర్వీస్ అందిస్తానని గ్రూప్–2 స్టేట్ 43వ ర్యాంక్ సాధించిన నల్ల అజయ్ కుమార్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల తిర్మలాపూర్ గ్రామానికి చెందిన నల్ల కోంరయ్య–నీలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దవాడైన అజయ్ కుమార్ ఒకటి నుంచి పదో తరగతి వరకు మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో చదివాడు. ఇంటర్ హనుమకొండలోని శివానీ కాలేజీలో, బీటెక్ హైదరాబాద్‌లో చదివాడు. 2018లో కానిస్టేబల్ ఉద్యోగం, 2024లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో ఇటీవల విడుదలైన గ్రూప్– 2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 43వ ర్యాంక్, కాళేశ్వరం జోన్‌లో 7వ ర్యాంక్ సాధించాడు. శుక్రవారం విడుదలైన గ్రూప్–3 ఫలితాల్లో స్టేట్ 26వ ర్యాంక్ సాధించాడు. గ్రూప్–2 ద్వారా వచ్చే ఉద్యోగాన్ని ఎంపిక చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని చెబుతున్నాడు.. అజయ్‌కుమార్.

తండా వాసికి 1,126 ర్యాంక్



తేజావత్ సూర్యకుమారి

మహబూబాబాద్ అర్బన్: కేసముద్రం మండలం పెనుగొండ గ్రామం వాచ్యా తండాకు చెందిన తేజావత్ సూర్యకుమారి గ్రూప్–3లో 450 మార్కులకు 269 మార్కులు సాధించి 1,126 ర్యాంక్ సాధించింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన తేజావత్ పెద్దరాములు– స్వరూప కుమార్తె సూర్యకుమారి గ్రూప్ –3లో ఉత్తమ ర్యాంక్ సాధించడంపై కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, హర్షం వ్యక్తం చేసున్నారు.

గ్రూప్–3లో స్టేట్ 57వ ర్యాంక్



రాజశేఖర్‌రెడ్డి

బచ్చన్నపేట : మండల కేంద్రానికి చిమ్ముల అరుణ–మల్లారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి కూతురు ప్రస్తుతం జనగామ మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తుండగా.. కుమారుడు చిమ్ముల రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం వెలువడిన గ్రూప్–3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 57వ ర్యాంక్ సాధించారు. గ్రూప్–2 ఫలితాల్లో 423.933 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి 8వ ర్యాంక్ సాధించాడు. గతంలో రాజశేఖర్‌రెడ్డి వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం గ్రూప్స్‌లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభమైన కొమ్మాల జాతర

- లక్ష్మీనర్సింహస్వామికి భక్తుల పూజలు
- కొమ్మాల స్టేజీ వద్ద స్తంభించిన ట్రాఫిక్
- అట్టహాసంగా రాజకీయ ప్రభలు



వివిధ ప్రాంతాల నుంచి ఎడ్లబండ్లపై కొమ్మాల జాతరకు వస్తున్న భక్తులు



కొండా మురళి ప్రభబండి ఎదుట లంబాడీ మహిళల నృత్యం



ప్రభబండిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ ఇనుగాల



ద్విచక్రవాహనాలపై ప్రభలు కట్టుకొని..

గీసుకొండ: మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర హోలీ పండుగతో శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యల్లో వచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. కొమ్మాల స్టేజీ నుంచి రాజకీయ పార్టీల ప్రభబండ్లు బయలుదేరడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రయాణికులు, భక్తులు, అంబులెన్స్‌లలోని రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు విఫలమయ్యారని భక్తులు అసహనం వ్యక్తం చేశారు. నిషేధం ఉన్నా కూడా జాతరలో డీజేల జోరు కొనసాగింది. కాంగ్రెస్ ప్రభను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖఃసంతోషాలతో ఉండాలన్నారు. బీఆర్ఎస్ ప్రభను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ పదేళ్లలో జాతర ఎంతో ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. అధికార పార్టీలోనే రెండు వర్గాలు కావడంతో జాతరలో ప్రశాంతత దెబ్బతిందన్నారు. బీజేపీ ప్రభను డాక్టర్ కాళీప్రసాద్ ప్రారంభించారు. కొండా వర్గం ప్రభను అల్లం బాలకిశోర్‌రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్ ఏర్పాటు చేయగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ప్రారంభించారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు వరద రాజేశ్వర్‌రావు, దొమ్మాటి సాంబయ్య, గన్నోజు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, అధికార ప్రతినిధి కొమురారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ కడారి రాజుయాదవ్, రాంబాబు, శ్రీనివాస్, ములక ప్రసాద్, ప్రవీణ్, పోలీస్ ధర్మారావు, బోడకుంట్ల ప్రకాశ్, జయపాల్‌రెడ్డి, రాజయ్య, నాగేశ్వర్‌రావు, భరత్ పాల్గొన్నారు. అంతకుముందు ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, ట్రెయినీ ఐపీఎస్ మనన్‌భట్, ఏసీపీ తిరుపతి స్వామివారిని దర్శించుకున్నారు.

రోడ్డుపై యువకుల న్యూసెన్స్

- కారు ఆపి అద్దాలు పగులగొట్టి హల్ చల్



ధ్వంసమైన కారు అద్దాలు



ఘటనా స్థలిలో గుమికూడిన ప్రజలు

హసన్‌పర్తి: హోలీ రంగుల్లో మునిగితేలిన యువకులు చిత్తుగా మద్యం సేవించారు. ఎదురుగా వస్తున్న కారును ఆపారు.. కారు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగి.. అద్దాలు పగులగొట్టారు. 56వ డివిజన్ వివేకానంద కాలనీలో శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వివేకానంద కాలనీకి చెందిన ఓ కారు హనుమకొండ వైపునకు బయల్దేరింది. అప్పటికే చిత్తుగా మద్యం సేవించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఏడుగురు వలస కూలీలు ఆ కారు అడ్డగించారు. తమకు కారు తాళం చెవి ఇవ్వమని డిమాండ్ చేశారు. అందుకు కారు డ్రైవర్ నిరాకరించడంతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో మరో యువకుడు బండ రాయిని కారు అద్దాలపైకి విసరడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. స్థానికులు ఆపడానికి ప్రయత్నించగా యువకులు మరింత రెచ్చిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని యువకులను అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఘటన సమయంలో కారులో డ్రైవర్‌తోపాటు కారు యజమాని(మహిళ) ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. తులసీ రెస్టారెంట్ అండ్ బార్‌ను తొలగించాని, నిత్యం మద్యంప్రియులు గొడవలు చేస్తుండడంతో ఇబ్బందిగా ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

భద్రాచలానికి గోటి తలంబ్రాలు



ఖానాపురం: తలంబ్రాలను భద్రాచలం తరలిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

ఖానాపురం: మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో గత తొంబై రోజులుగా గోటితో ఒలిచిన తలంబ్రాలకు పూజారి పర్వతపు శివప్రసాద్‌శాస్త్రి ప్రత్యేక పూజలు చేశారు. గోటితో ఒలిచిన తలంబ్రాలను భద్రాచలం సీతారామచంద్ర స్వామి కల్యాణమహోత్సవానికి తరలించారు. అక్కడ ఆలయంలో తలంబ్రాలతో కలిపి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మరికొన్ని తలంబ్రాలను తీసుకొచ్చి కల్యాణ వేడుకలను చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపూడి సుబ్బారావు తెలిపారు.

గూడూరు: సీతారాముల కల్యాణోత్సవంలో ఉపయోగించే గోటి తలంబ్రాలను భక్తులు శుక్రవారం గూడూరు నుంచి భద్రాచలం చేర్చారు. శ్రీరామనవమికి ముందు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు గోటితో ఒలిచిన బియ్యాన్ని తలంబ్రాల కోసం తరలిస్తారు. ఈ క్రమంలో గూడూరు మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో గత నెల 24 నుంచి భక్తులు ధాన్యాన్ని గోటితో ఒలిచే కార్యక్రమం చేపట్టారు. హిందూ జాగరణ సమితి, సేవికా సమితి మహిళలు అందరూ కలిసి గోటి తలంబ్రాలను భద్రాచల రాములవారి దేవాలయానికి చేర్చారు. హోలీ పండుగ సందర్భంగా అక్కడ రంగులు చల్లుకొని సంబురాన్ని పంచుకున్నట్లు మహిళలు తెలిపారు.

ఇక 'కృత్రిమ' పాఠాలు!

విద్యార్థులకు ఏఐతో బోధన

- అభ్యసన సమర్థ్యాల సాధన కోసం అమలు
- నేడు అధికారికంగా ప్రారంభం
- జిల్లాలోని తొమ్మిది ప్రాథమిక పాఠశాలలు ఎంపిక



విద్యారణ్యపురి: రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకుంది. కంప్యూటర్ల సాయంతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) ద్వారా పాఠాలు బోధించనుంది. ఇప్పటికే ఆరు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా కార్యక్రమాన్ని ప్రారంభించింది. అక్కడ విజయవంతం కావడంతో రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో కూడా ఈ కార్యక్రమం అమలు చేయనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దీన్ని అమలు చేయనున్నారు. సంబంధిత ఎంఈఓ, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లో ఒకరోజు శిక్షణ ఇచ్చారు.

పాఠశాలలివే..

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపెల్లి, ముల్కనూరు ప్రాథమిక పాఠశాల, ధర్మసాగర్ మండలం దేవనూరు ప్రాథమిక పాఠశాల, హనుమకొండ మండలం కుమార్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, హసన్‌పర్తి మండలం దేవన్నపేట, నాగారం, మడిపల్లి ప్రాథమిక పాఠశాలలు, ఐనవోలు మండలం కక్కిరాలపల్లి ప్రాథమిక పాఠశాల, పరకాల మండలం నాగారం ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధ ద్వారా బోధనను ప్రారంభించనున్నారు. కలెక్టర్ ప్రావీణ్య, డీఈఓ వాసంతి కలిసి ఐనవోలు మండలం కక్కిరాలపల్లి ప్రాథమిక పాఠశాలలో నేటి (శనివారం) నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అయితే 9 పాఠశాలల్లో 404 మంది విద్యార్థులుండగా.. అభ్యసన సామర్థ్యాల్లో బాగా.. వెనుకబాటులో ఉన్న సీగ్రేడ్ విద్యార్థులైన 109 మందికి ఈకృత్రిమ మేధ ద్వారా పాఠాలు అందించేలా ఏర్పాట్లు చేశారు. కృత్రిమ మేధను అనుసరించి ఏక స్టెప్ ఫౌండేషన్ రూపొందించిన కంప్యూటర్ ఆధారిత కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించింది. ఒక్కో హైస్కూల్‌లోని విద్యార్థుల కోసం ఐదు కంప్యూటర్లు ఇప్పటికే అందించారు.

వివిధ సబ్జెక్టుల్లో బోధన

విద్యార్థులకు తెలుగు, ఆంగ్లానికి సంబంధించి ప్రమాణాలు నేర్పుతారు. గణితంలో సంఖ్యా భావనలు, కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు, ఆరోహణ, అవరోహణ సామర్థ్యాలు నేర్పిస్తారు. ఇందుకు సంబంధించి హనుమకొండ జిల్లాలోని 10 పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు 5 కంప్యూటర్లు చొప్పున అందించింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో భాగంగా విద్యార్థికి దృశ్య, శ్రవణ జ్ఞానం చేకూరుతుంది. సామర్థ్యాలు పెరుగుతాయి.

వరంగల్ జిల్లాలో 11 ప్రభుత్వ పాఠశాలలు..

కాశీబుగ్గ కాజీ సెంటర్: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధస్సు)తో ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. పైలట్ ప్రాజెక్టు కింద వరంగల్ జిల్లాలో 11 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేయగా.. విద్యార్థులకు ఏఐ సహకారంతో వర్చువల్ రియాల్టీ విధానంలో పాఠాలు చెప్పేలా కసరత్తు జరుగుతోంది. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంచే లక్ష్యంగా శనివారం నుంచి ఏఐ బోధన ప్రారంభించనుంది. ఎఫ్ఎల్ఎన్‌కు సాంకేతికత జోడించి ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్జీటీలకు శిక్షణ ఇచ్చారు.

పకడ్బందీగా అమలు చేస్తాం



జిల్లాలోని 9 పాఠశాలల్లో కృత్రిమ మేధ ఆధారిత పాఠ్యాంశాలను అందించాలని నిర్ణయించాం. ఇందుకు సంబంధించి పాఠశాలలో ఉపాధ్యాయుల, విద్యార్థుల ఎంపిక జరిగింది. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల ద్వారా పర్యవేక్షణ చేస్తారు. అధునాతన టెక్నాలజీని వాడుకోవడం ద్వారా విద్యార్థులకు మేలు జరుగుతుంది.

– వాసంతి, డీఈఓ, హనుమకొండ

టీచర్లకు శిక్షణ ఇచ్చాం



జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల నుంచి ఒక్కో ఉపాధ్యాయుడికి కృత్రిమ మేధకు సంబంధించి శిక్షణ ఇచ్చాం. ఇంటర్నెట్‌ను ఉపయోగించుకుని కంప్యూటర్లో విద్యార్థులు తమ ఫోన్ నంబర్ ద్వారా లాగిన్ కావొచ్చు. దీనికి సంబంధించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రతీ రోజు పాఠ్యాంశాలను అందిస్తూ, ప్రగతిని నమోదు చేస్తూ ఉండాలి. ఉపాధ్యాయులు కూడా వారి ఐడీ ద్వారా కార్యక్రమాన్ని ఈపాఠ్యాంశాలను అభ్యసించవచ్చు.

– ఏ.శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్

కిడ్నాప్ కిలాడీ

- గంజాయి చాక్లెట్లిచ్చి బాలికల అపహరణ
- కొన్ని గంటల తర్వాత విడుదల
- మైనర్ బాలిక ఫిర్యాదుతో విషయం వెలుగులోకి
- పోలీసుల అదుపులో ఆమెతో పాటు మరో ముగ్గురు

ఖిలా వరంగల్: ఓ కిలేడీ మాయ మాటలతో బాలికలకు దగ్గరయ్యేది. వారికి గంజాయి పదార్థాలిచ్చి కిడ్నాప్ చేసేది. కొందరికి అప్పగించి.. మళ్లీ కొద్ది గంటల తర్వాత తీసుకొచ్చి వదిలేసేది. ఇటీవల ఓ బాలిక కిడ్నాప్ అయిన అనంతరం ఇంటికొచ్చాక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కిలాడీ గుట్టురట్టయ్యింది. హనుమకొండ జిల్లా దామెర మండల పరిధి ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో కొంత కాలంగా నివాసం ఉంటోంది. డ్రగ్స్‌కు బానిసైన ఆమె శంభునిపేట ప్రాంతానికి చెందిన నలుగురు యువకులతో పరిచయం పెంచుకుంది. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి కళాశాలలు, స్కూళ్లు, రహదారులపై ఆమె.. తిష్టవేసి బాలికలను టార్గెట్ చేసేది. మాటల్లో పెట్టి దగ్గరయ్యేది. బాలికలకు మత్తు పదార్థాలిచ్చి అప్పటికే తన గ్యాంగ్‌కు అనుకూలంగా ఉన్న కొందరు మానవ మృగాలకు వారిని అప్పగించేదని తెలిసింది. ఆబాలికలు పూర్తిగా స్పృహలోకి రాగానే కిలాడీ లేడీ ఎక్కడి నుంచి తీసుకెళ్లేదో అక్కడే వదిలేసి వెళ్లేది.

ఇన్‌స్టాగ్రాంలో పరిచయాలు..

ఇన్‌స్టాగ్రాంలో సైతం బాలికలను పరిచయం పెంచుకోవడంలో ఆమె దిట్ట.. వలలో చిక్కిన బాలికలను వరంగల్ ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, ఇతర జిల్లాలకు తరలించి గంజాయి మత్తులోకి దించి వారి జీవితాలను నాశనం చేసిందని సమాచారం. వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండ్రోజుల క్రితం ఓ బాలిక రోజంతా కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి ఇంటికి చేరుకున్న బాలికను తండ్రి ఆరా తీయగా తనను ఓ మహిళ కిడ్నాప్ చేసి తీసుకెళ్లిందని, ఆ తర్వాత తనకేం జరిగిందో తెలియదని, స్పృహలోకి వచ్చాక వదిలేసి వెళ్లినట్లు చెప్పింది. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించగా.. ఆమెకు డ్రగ్స్ ఇచ్చినట్లు సమాచారం.. ఆబాలిక చెప్పిన వివరాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో సదరు కిలాడీ లేడీతోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకోగా.. పరారీలో ఉన్న ఆటో డ్రైవరే ప్రధాన నిందితుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. గతంలో ఇతడిపై పలు చోరీ కేసులు నమోదయ్యాయి. కాగా.. బాలికల కిడ్నాప్ అనంతరం ఆటోలో తరలించినట్లు సమాచారం.

కొనసాగుతున్న విచారణ

పోలీసుల అదుపులో ఉన్న కిలాడీ లేడీతోపాటు మరో ముగ్గురిని అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నారు. మాయమాటలతో బాలికలను మచ్చిక చేసుకున్న తర్వాత మత్తులో ఎక్కడికి తరలిస్తున్నారు? వీరితో ఎవరెవరికి సంబంధాలున్నాయి. మత్తులోకి దించిన బాలికలను ఎక్కడికి తరలించి ఎవరికి అప్పగిస్తున్నారనే అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

బ్యాంక్ నిర్లక్ష్యంపై వినియోగదారుల కమిషన్ కన్నెర్ర

వరంగల్: కాజీపేట రైల్వే పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి అశోక్‌కుమార్.. మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.29,000 పర్సనల్ లోన్‌ను 2004 డిసెంబర్ 7లోనే పూర్తిగా చెల్లించారు. అయినప్పటికీ 19 ఏళ్లుగా ఇంటి కాగితా లు ఇవ్వకుండా తిప్పలు పెట్టడంతో అశోక్‌కుమార్ వినియోగదారుల మండలి సహకారంతో 2023లో వరంగల్ జిల్లా వినియోగదారుల కమిషన్ (వినియోగదారుల కోర్టు)లో ఫిర్యాదు చేశాడు. అయితే అశోక్‌కుమార్‌తోపాటు సహోద్యోగులైన 30మంది 2002 సంవత్సరంలో ఒక్కొక్కరు రూ.29వేలు పర్సనల్ లోన్ తీసుకుని, రెండు సంవత్సరాల తర్వాత చెల్లించారు. అయి తే అందులో ఇద్దరు మాత్రం చెల్లించలేదు. కె.నర్సయ్య అనే ఉద్యోగి చనిపోగా, ఎం.భాస్కర్ అనే ఉద్యోగి రిటైర్డ్ అయిపోయాడు. అయితే మొత్తం 30మంది ఉద్యోగులకు లీడర్‌గా వ్యవహరించిన అశోక్ కుమార్ తన అప్పు పూర్తిగా చెల్లించాడు. కానీ, మిగతా ఇద్దరు బాకీ చెల్లించిన త ర్వాతనే.. అశోక్ కుమార్ ఇంటి కాగితాలు విడుదల చేస్తామని బ్యాంకు అధికారులు మొండికేశారు. పర్సనల్ లోన్ తీసుకున్న తర్వాత, వారి వేతనాల నుంచి డిడక్షన్ చేసి, వాయిదా మొత్తాలను బ్యాంకుకు పంపాల్సిన బాధ్యత పోస్టల్ అధి కారులదే.. ఈ క్రమంలో పోస్టల్ అధికారుల నిర్లక్ష్యంతో మిగిలిపోయిన బకాయిలకు అశోక్‌కుమార్‌ను బాధ్యున్ని చేస్తూ, అతని ఇంటి కాగితాలు ఇవ్వకుండా మహేష్ కో ఆపరేటివ్ బ్యాంక్ 19ఏళ్లుగా సతాయిస్తున్నట్లు కమిషన్ అధ్యక్షుడు జి.నాగరాజు, సభ్యులు వి.నరసింహారావు నిర్ధారణకు వచ్చారు. అశోక్‌కుమార్‌కు ఇంటి కాగితాలు ఇవ్వాలని, బ్యాంకు బాకీ ఉన్న వారి నుంచి లోన్ డబ్బులు వసూలు చేసుకోవాలని తెలిపారు. కేసు కోసం అయిన ఖర్చులు రూ.20వేలు బ్యాంక్ చెల్లించాలని ఆదేశించారు.